క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ ఆర్టీసీ డిపోలో శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎం జాకీర్‌హుస్సేన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. సందేహాలు, సమస్యలు, ఫిర్యాదులు, సూచనల గురించి 99592 26269 నంబర్‌కు కాల్‌చేసి తెలుపాలని కోరారు.

ఎల్వోసీ అందజేత


ఎల్వోసీని అందజేస్తున్న ఎంపీ సురేశ్ షెట్కార్

నారాయణఖేడ్: నిజాంపేట మండలం రాంచందర్ తండాకు చెందిన కేతావత్ రాంనాయక్ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సీఎం సహాయనిధికి దరఖాస్తు చేయగా రూ.2.50 లక్షలు మంజూరు చేస్తూ లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్వోసీ) ఉత్తర్వు జారీ అయ్యింది. శుక్రవారం హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ ఎల్వోసీ ఉత్తర్వును బాధితుడి కుటుంబీకులకు అందజేశారు. నాయకులు మశ్చేందర్, అశోక్‌నాయక్, రత్నియా, అజయ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ పోస్టర్ ఆవిష్కరణ


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నారాయణఖేడ్: ఖమ్మం జిల్లా కేంద్రంలో ఈనెల 25 నుంచి 27 వరకు నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర ఎస్ఎఫ్ఐ 5వ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి రాజేశ్ కోరారు. ఖేడ్‌లో శుక్రవారం విద్యార్థులతో కలిసి మహాసభల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ సంస్థలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్స్, స్కాలర్‌షిప్స్ బకాయిలను విడుదల చేయకపోవడంతో పేద విద్యార్థులు చదువులకు దూరమయ్యే పరిస్థితి నెలకొందన్నారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సతీశ్, నాయకులు బస్వరాజ్, యోగి, విష్ణు, గణేశ్, వరుణ్‌తోపాటు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు సన్మానం


ప్రభుత్వ ఉద్యోగం సాధించిన వారిని సన్మానిస్తున్న ముదిరాజ్ నాయకులు

జహీరాబాద్ టౌన్: ఇటీవల ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన ముదిరాజ్ బిడ్డలను సంఘం నాయకులు శుక్రవారం సన్మానించారు. పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీలో నిర్వహించిన సమావేశంలో సంఘం అధ్యక్షుడు పట్లోల గోపాల్ మాట్లాడుతూ ముదిరాజ్ బిడ్డలు నలుగురు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు సంగప్ప, శ్రీశైలం, దత్తాత్రి, శంకర్, రవి, రాజనర్సింహ, రాములు, మల్లికార్జున్ పాల్గొన్నారు.

చిన్నారులకు పట్టాల ప్రదానం


పట్టాలు ప్రదానం చేస్తున్న మాజీ సర్పంచ్

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లిలోని మన్నాపూర్‌లో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. అంగన్‌వాడీలో చదువుతున్న పిల్లలకు పట్టాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి వెంకట్‌రెడ్డి హాజరై అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ,ఆశ వర్కర్, ఏఎన్‌ఎం, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జిన్నారంను మున్సిపాలిటీగా మార్చొద్దు

- ప్రజలు, రైతులకు నష్టం
- తహసీల్దార్, ఎంపీడీవోలకు వినతిపత్రం అందజేసిన బీఆర్ఎస్ నాయకులు


అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

జిన్నారం (పటాన్‌చెరు): గ్రామీణ నేపథ్యం గల జిన్నారం మండలాన్ని మున్సిపాలిటీగా మార్చవద్దంటూ జిన్నారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున నిరసన, ధర్నా కార్యక్రమాలు చేపట్టారు. శుక్రవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి పటాన్‌చెరు నియోజకవర్గ పార్టీ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, కొలన్ బాల్‌రెడ్డి, కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పార్టీ శ్రేణులతో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ర్యాలీగా నినాదాలు చేస్తూ మున్సిపాలిటీకి వ్యతిరేకంగా తహసీల్దార్ భిక్షపతికి వినతిపత్రం అందజేశారు. అలాగే మండల పరిషత్తు కార్యాలయానికి వెళ్లి ధర్నా చేశారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ... ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా కాంగ్రెస్ ప్రభుత్వం మొండి వైఖరి ప్రదర్శిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహకు ఈ ప్రక్రియపై వినతి పత్రం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. గ్రామీణ నేపథ్యం గల జిన్నారం మండలాన్ని మున్సిపాలిటీగా మారిస్తే ప్రజలు, రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. అవసరమైతే మరో పోరాటానికి సిద్ధమని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకటేశ్ గౌడ్, రాజేశ్, శ్రీనివాస్ గౌడ్, రామకృష్ణ, శ్రీధర్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, మాజీ ప్రజాప్రతినిధులు ప్రభాకర్ రెడ్డి, ఆంజనేయులు, శివరాజ్, ఖధీర్, నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఆలయ పాలకమండలి


మంత్రి దామోదరను కలిసిన పాలకమండలి సభ్యులు, నాయకులు

సంగారెడ్డి జోన్: ఇటీవల నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన కేతకీ సంగమేశ్వర ఆలయ పాలక మండలి సభ్యులు శుక్రవారం మంత్రి దామోదర రాజనర్సింహను కలిశారు. సంగారెడ్డి పట్టణంలోని మంత్రి నివాసంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్‌రావుపాటిల్‌తో కలిసి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పాలకమండలి చైర్మన్ చంద్రశేఖర్ పాటిల్‌తో పాటు సభ్యులను మంత్రి అభినందించారు. కార్యక్రమంలో ఈఓ శివ రుద్రప్ప, పాలకమండలి సభ్యులు, నాయకులు ఉదయ్ శంకర్ పాటిల్, మల్లికార్జున్, నవాజ్‌రెడ్డి, లక్ష్మణ్, శివకుమార్, మల్‌శెట్టి, మల్లయ్యస్వామి, బసయ్యస్వామి, మల్లప్ప, శ్రీనివాస్, రాజేందర్ సింగ్ పాల్గొన్నారు.

నీటి కనెక్షన్లను సక్రమంగా వాడాలి

మిషన్ భగీరథ ఈఈ పాష


ట్యాంకును పరిశీలిస్తున్న అధికారులు

హత్నూర (సంగారెడ్డి): మిషన్ భగీరథ నల్లా కనెక్షన్‌లో ఉన్న చెర్రాలను తొలగిస్తే ఇంటి యజమానిపై కేసులు నమోదు చేయిస్తామని మిషన్ భగీరథ ఈఈ పాష హెచ్చరించారు. శుక్రవారం హత్నూర మండలం సిరిపురం గ్రామంలో మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లను పరిశీలించారు. నీటి కనెక్షన్‌లో ఉన్న చరాలను తొలగించడం వల్ల సమస్య తలెత్తిందని వీటిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. నీటి కోసం కొంతమంది ధర్నా చేసినవారే ఇంటివద్ద మోటర్లు బిగించడం వల్ల ఈ సమస్య తలెత్తిందన్నారు. నీటి కనెక్షన్లను ఇప్పటికైనా సక్రమంగా వాడుకోవాలని, లేకుంటే కేసులు నమోదు చేయడంతో పాటు జరిమానా విధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీజీ శ్రీనివాస్ ,ఏఈ శ్రీనివాస్ గౌడ్, ఎంపీఈఓ యూసుఫ్, గ్రామ కార్యదర్శి, స్థానికులు ఉన్నారు.

హైమాస్టు లైట్ల ఏర్పాటు

యువకుల చొరవతో..


న్యాల్‌కల్‌లో హైమాస్టు స్తంభం కోసం తీసిన గుంత

న్యాల్‌కల్(జహీరాబాద్): ఎవరో వస్తారు.. ఏదో చేస్తారని ఎదురు చూడకుండా గ్రామ యువకులు ముందుకు వచ్చి హైమాస్టు లైట్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లో నారాయణఖేడ్ వెళ్లే చౌరస్తా వద్ద ఉన్న హైమాస్టు లైట్ స్తంభాన్ని ఇటీవల ఓ లారీ ఢీకొట్టడంతో విరిగిపోయింది. దీంతో చౌరస్తా వద్ద చీకటి నెలకొంది. చౌరస్తా నుంచి ఆయా ప్రాంతాలకు వెళ్లే ప్రజలు రాత్రి ఇబ్బందులు పడుతున్నారు. ఇది గమనించిన యువకులు శ్రీకాంత్, బస్వరాజ్, విష్ణు, నవీన్, సాయి, ప్రతీష్, రాము, యాదగిరి సతీశ్ తదితరులు విరిగిపోయిన స్తంభాన్ని ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చారు. శుక్రవారం ఉదయం కూలీలను పిలిపించి గుంతను తవ్వించారు. శనివారం హైమాస్టు లైట్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. దీంతో యువకులను పలువురు అభినందించారు.

విగ్రహాన్ని ధ్వంసం చేసినవారిని శిక్షించాలి

దళిత సంఘాల ఆధ్వర్యంలో ధర్నా


దుండగులు ధ్వంసం చేసిన గౌతమ బుద్ధుడి విగ్రహం


విగ్రహం ఎదుట ధర్నా చేస్తున్న దళిత సంఘాల నాయకులు

నారాయణఖేడ్: మండలంలోని అబ్బెంద గ్రామంలో గౌతమ బుద్ధుడి విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఖేడ్ నియోజకవర్గ భీమ్ ఆర్మీ అధ్యక్షుడు అనుముల తుకారాంతోపాటు వివిధ దళితసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. విగ్రహాన్ని గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయగా ఘటనను నిరసిస్తూ శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అహింసా సందేశాన్ని ప్రచారం చేసిన బుద్ధుడి విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నిందితులను కఠినంగా శిక్షించడంతోపాటు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. ధర్నాలో వివిధ దళితసంఘాల నాయకులు పాల్గొన్నారు.

రైతుల హక్కుల కోసం ఉద్యమిద్దాం


పతాకాన్ని ఆవిష్కరిస్తున్న రాజయ్య తదితరులు

కొండాపూర్(సంగారెడ్డి): పంట గిట్టుబాటు ధరలతో పాటు రైతుల హక్కుల కోసం ఉద్యమించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన కొండాపూర్‌లో అఖిల భారత రైతు కిసాన్ సభ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం రాజయ్య మాట్లాడుతూ నేటి పాలకులు రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా రైతాంగాన్ని దగా చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక చట్టాలు తీసుకువచ్చి కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవులు, వెంకన్న ,ఆసిఫ్ అలీ, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి


సమావేశంలో మాట్లాడుతున్నతహసీల్దార్

పటాన్‌చెరు: ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణాలను వేగవంతం చేయాలని అధికారులు సూచించారు. శుక్రవారం మండలంలోని రామేశ్వరంబండ గ్రామంలోని ఇళ్ల లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తహసీల్దార్ రంగారావు, ఎంపీడీవో యాదగిరి, ఎంపీవో హరిశంకర్ గౌడ్, హౌసింగ్ ఈఈ రవీందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బేస్మెంట్ లెవల్ పూర్తి చేసిన వారికి రూ.లక్ష ఎప్పుడు ఇస్తారని లబ్ధిదారులు అధికారులను నిలదీశారు. దీంతో ఎంపీడీవో, తహసీల్దార్లు యాప్‌లో రిజిస్ట్రేషన్ చేస్తే ప్రభుత్వం డబ్బులు వేస్తుందని లబ్ధిదారులకు సర్దిచెప్పారు. గ్రామంలో 67 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరయ్యాయని నిర్మాణాలు ప్రారంభించాలని సూచించారు. గ్రామ నాయకులు సోమిరెడ్డి, ఐకేపీ సీసీ నవీన్, గ్రామ కార్యదర్శి జ్యోతి, మాజీ ఎంపీటీసీ అంతారెడ్డి పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్ : డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. పటాన్ చెరు ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ కథనం ప్రకారం ... గురువారం నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 12 మందిని పట్టుకున్నారు. పట్టుబడిన వాహనదారులను శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా 10 మందికి రూ.1500 జరిమానా, ఇద్దరికీ రూ.2 వేలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

అక్రమ నిర్మాణాలపై కొరడా


అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న ఆర్ఐ

జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం మున్సిపాలిటీ సర్వే నం. 27లోని తెలంగాణ కాలనీలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను శుక్రవారం తహసీల్దార్ ఆదేశాల మేరకు ఆర్ఐ జయప్రకాశ్ నారాయణ నేలమట్టం చేశారు. స్థానిక బీజేపీ నాయకుడి ఫిర్యాదు మేరకు చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆర్ఐ కబ్జాదారులను హెచ్చరించారు.

వాహనాల తనిఖీ


జహీరాబాద్ టౌన్: మండల కేంద్రమైన మొగుడంపల్లిలో శుక్రవారం పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. జహీరాబాద్ డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జహీరాబాద్ టౌన్ సీఐ శివలింగం, చిరాగ్‌పల్లి ఎస్ఐ. రాజేందర్‌రెడ్డి మొగుడంపల్లి చౌరస్తాలో వాహన తనిఖీలు చేశారు. ప్రతి వాహనాన్ని క్షుణంగా పరిశీలించారు. ముగ్గురిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేసి, ధ్రువ పత్రాలు సరిగా లేని వాహనాలను సీజ్ చేశారు. కర్నాటక రాష్ట్రం నుంచి అక్రమ రవాణా కాకుండా ఈ తనిఖీలు నిర్వహించినట్లు తెలిసింది.

చర్యలు తీసుకోవాలి

సంగారెడ్డి జోన్: తప్పుడు వార్త రాసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని యువజన కాంగ్రెస్ నాయకులు శుక్రవారం సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓ పత్రికలో మంత్రి పేరుతో అక్రమ బియ్యం రవాణా అనే కథనం ప్రచురితమైందన్నారు. కానీ అది వాస్తవం కాదని తెలిపారు. కథనం రాసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వినయ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలి

ఎస్పీ పంకజ్



సంగారెడ్డి జోన్: హనుమాన్ జయంతి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శోభాయాత్రలు ప్రశాంతంగా జరిగేందుకు జిల్లా వ్యాప్తంగా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు ఆయన వివరించారు. ప్రధాన కూడళ్లలో పోలీస్ పికెట్లు ఏర్పాటు చేసి, నిరంతరం పెట్రోలింగ్ చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు ఇబ్బందిపడేలా డీజేలను ఏర్పాటు చేయకూడదన్నారు. ఇతర మతాల మనోభావాలను దెబ్బతినే విధంగా నినాదాలు, ప్రసంగాలు ఉండకూడదన్నారు. ర్యాలీలో పాల్గొనే వారు సహనంగా ప్రవర్తించాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే రూమర్లను నమ్మవద్దని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరైనా ప్రవర్తిస్తే చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

గ్రామాల్లో సమస్యలు లేకుండా చర్యలు


రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఈఓ స్వప్న

వట్‌పల్లి(అందోల్): గ్రామాల్లో సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని జెడ్పీ డిప్యూటీ సీఈఓ ఆర్. స్వప్న అన్నారు. శుక్రవారం వట్‌పల్లి ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మండలంలోని గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం 2022-23, 2023-24 సంవత్సరాలలో వార్షిక నిధులకు సంబంధించిన రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు గ్రామాలను ఎప్పటికప్పుడు సందర్శించి పనుల పురోగతిని పరిశీలించాలన్నారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఎంపీడీఓ అంజయ్య, సీనియర్ అసిస్టెంట్ దశరథ్, జూనియర్ అసిస్టెంట్ రమేశ్, సూపరింటెండెంట్ హుస్సేన్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు పూలే


మహాత్మ జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్ చెరు: సామాజిక ఉద్యమాలకు మార్గదర్శి, మహిళల విద్య కోసం విశేష కృషి చేసిన మహాత్మ జ్యోతిరావు పూలే జీవితం ప్రతీఒక్కరికి ఆదర్శప్రాయమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. జ్యోతిరావు పూలే జయంతి పురస్కరించుకుని..' పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని.. పూలె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సొంత నిధులతో ఆస్పత్రి సమీపంలో జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, స్థానిక కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, దళిత సంఘాల ప్రతినిధులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

సదాశివపేట పట్టణంలో...


జ్యోతిరావుపూలే జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తదితరులు

సదాశివపేట(సంగారెడ్డి): సదాశివపేట పట్టణ పరిధిలో శుక్రవారం జ్యోతిరావుపూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద జ్యోతిరావుపూలే విగ్రహానికి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


పటాన్‌చెరు టౌన్: మహాత్మ జ్యోతిబా పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నీలం మధు


నారాయణఖేడ్: నివాళులర్పిస్తున్న డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు

మనుషులందరూ అన్ని రంగాల్లో సమానత్వంతో జీవించాలని, ఆధిపత్య విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తూ తన జీవితాన్ని ధారపోసిన భారతీయ సామాజిక తత్వవేత్త మహాత్మ జ్యోతిబా పూలే అని పలువురు నాయకులు పేర్కొన్నారు. వివక్షలేని సమానత్వ సమాజం కోసం శ్రమించిన బడుగు, బలహీన వర్గాల ఆశా జ్యోతి అని కొనియాడారు. జ్యోతిబాపూలే జయంతిని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా నాయకులు, అధికారులు, వివిధ ప్రజా సంఘాల వారు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

క్రీడలతోనే మానసికోల్లాసం


స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభిస్తున్న లక్ష్మారెడ్డి తదితరులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 13న ఆ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్పోర్ట్స్ మీట్ నిర్వహించడం అభినందనీయమని సంగారెడ్డి మండల విద్యాధికారి విద్యాసాగర్ తెలిపారు. స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా శుక్రవారం సంగారెడ్డిలోని బ్యాడ్మింటన్ అకాడమీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన బ్యాడ్మింటన్ టోర్నీని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి, డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీని విద్యాసాగర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఉపాధ్యాయులకు మానసిక ఉల్లాసం, శారీరకంగా ఫిట్‌గా ఉండటం కోసం స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నారని తెలిపారు. శనివారం కేకే భవన్‌లో ఇండోర్ గేమ్స్ చెస్, క్యారమ్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. విజేతలుగా నిలిచిన వారికి సంగారెడ్డిలోని సైన్స్ కేంద్రం వద్ద నిర్వహించే సభలో బహుమతులను ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు, జిల్లా కార్యదర్శి సాయితేజ, టీఎస్ యూటీఎఫ్ జిల్లా క్రీడా కమిటీ కన్వీనర్ రామరాజు, కో కన్వీనర్ మనోహర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు

సంగారెడ్డి: రైతుల కోసం శుక్రవారం చౌటకూరు మండలంలోని గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఉప్పరిగూడ,బొమ్మరెడ్డి గూడెం, పోసన్‌పల్లి, వెంకట కిష్టాపూర్, వెండికోలు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దశరథ్, ఆత్మ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి అధికారులతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఈశ్వర్ గౌడ్, రాములు , ప్రభాకర్ రెడ్డి, గణేశ్, ఉప్పర్‌గూడెం నాయకులు శివకుమార్, వెండికోల్ మాజీ సర్పంచ్ జైరాంరెడ్డి, గ్రామ అధ్యక్షుడు, గ్రామ పెద్దలు, వెంకట కిష్టాపూర్ గ్రామ అధ్యక్షుడు శేఖర్, అధికారులు మల్లేశం , శివలక్ష్మి, ప్రవీణ, వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.